క్లుప్తంగా

మామిడి, కొబ్బరి చెట్లు దగ్ధం

బంగారుపాళెం: బంగారుపాళెంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదంలో మామిడి, కొబ్బరి చెట్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన రైతులు శ్యామలమ్మ, వెంకటప్పకు రాగిమానుపెంట రోడ్డు పక్కన మామిడితోట ఉంది. అక్కడున్న మద్యం దుకాణం వద్ద మంటలు చెలరేగి మామిడితోటలోకి పాకాయి. దీంతో 250 మామిడి, కొబ్బరి చెట్లు కాలిపోయినట్టు బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. అధికారులు ఆదుకోవాలని కోరారు.

క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

యాదమరి : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని స్పందన ఫౌండేషన్ అధినేత శ్యామలదేవి, యాదమరి యూనియన్ బ్యాంక్ మేనేజర్ మురళి ఆకాంక్షించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షిక క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గిరిరాజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి

తవణంపల్లె : స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న ఏఎస్‌ఐ రాజేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యంను బుధవారం ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. ఏఎస్‌ఐ రాజేంద్ర గుడిపాలకు, హెచ్‌సీ సుబ్రమణ్యం పుంగనూరుకు బదిలీ అయ్యారు.

ఓటు వినియోగంపై అవగాహన

యాదమరి : స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం వీవో లీడర్లకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఏపీవో కల్పలతా రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే విషయాన్ని వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమకు నచ్చిన నాయకుడికి ఓటు వేసి ఎన్నుకుంటామని మహిళలు ప్రమాణం చేశారు.

పూతలపట్టుకు ప్రత్యేక బస్సు



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

పూతలపట్టు : పూతలపట్టు పంచాయతీ చుట్టుపక్కల గ్రామాల సౌకర్యార్థం ప్రభుత్వం ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేసింది. గ్రామస్తులు వినతి మేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి డిపో రీజినల్ మేనేజర్ చెంగల్ రెడ్డి, ఆర్టీసీ మాజీవైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి వయా పూతలపట్టు రూట్‌కు బస్సును కేటాయించారు. బస్సు బుధవారం కొత్తకోట మీదుగా మన్నార్‌పల్లె, వేనూతనపల్లె, పోలవరం, అనంతాపురం, పూతలపట్టు మీదుగా బయలుదేరింది.

వరసిద్ధుని సేవలో కంచి కామకోటి పీఠాధిపతి



కాణిపాకం : కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి తన శిష్యబృందంతో దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. వారు క్షీరాభిషేకం, మహా హారతి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారి చిత్ర పటం, తీర్థ ప్రసాదాలను ఆలయ చైర్మన్ అందజేశారు. అనంతరం విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆలయ కల్యాణ వేదికలో అనుగ్రహ భాషణం చేశారు. త్వరలో కంచిపీఠం, కాణిపాక ఆలయ అనుబంధంగా పౌరోహిత్యం, పద్ధతి పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఫొటోగ్రాఫర్ కె.పన్నీర్‌సెల్వం (35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. రామ్‌నగర్ కాలనీకు చెందిన పన్నీర్‌సెల్వం ఆర్టీసీ డిపో రోడ్డులో ఫొటోగ్రాఫర్‌గా స్టూడియో నడుపుతున్నాడు. తండ్రి సంపత్‌తో కలిసి రామ్‌నగర్ కాలనీలో ఉంటున్నాడు. సంపత్ నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ ఉదయం వెళితే, రాత్రికి ఇంటికి వస్తాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన పన్నీర్‌సెల్వం లోపల గడియ పెట్టి తలుపులు వేసుకున్నాడు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన సంపత్ తన వద్ద ఉన్న మరోతాళంతో తలుపుతీసి చూడగా.. కొడుకు ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సాయంతో కిందికి దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం

- 'వైఎస్సార్ చేయూత' పంపిణీలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి



చెక్కు అందజేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: వైఎస్సార్ చేయూతతో మహిళలకు ఆర్థికాభివృద్ధి బాటలు వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి మహిళలంతా తమ ఓటు హక్కుతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిత్తూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం వైఎస్సార్ చేయూత మెగా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నావడ్డీ మొదలైన పథకాల ఫలాలను సద్వినియోగం చేసుకుని చాలా మంది మహిళలు జీవనోపాధి పొందారన్నారు. ఈ మేలును మహిళలందరూ గుర్తెరిగి, పార్టీని ఆశీర్వదించాలని కోరారు. లబ్ధి పొందిన సంక్షేమ పథకాలను నిర్భయంగా చెప్పొచ్చన్నారు. గత ఎన్నికల్లో పసుపు–కుంకుమ పేరిట మోసం చేసిన చంద్రబాబు మరోసారి ఇస్తున్న హామీలకు, ప్రలోభాల బారిన పడకుండా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాబునాయుడు, మండల కన్వీనర్ త్యాగరాజులు, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, నాయకులు సంపత్, రాబర్ట్, రాజా, వేలుస్వామి, దేవేంద్రరెడ్డి, సాము, శంకర్, నంద, పట్టాభి, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీఎం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మసముద్రంలో జోరుగా ఎన్నికల ప్రచారం

గుడిపాల: అభివృద్ధి కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆదరించాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బొమ్మసముద్రంలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి జగనన్న మేలు చేశారని, కుటుంబానికి మేలు చేశారని భావిస్తే పార్టీని ఆశీర్వదించాలన్నారు. చంద్రబాబు నాయుడు మాటలను ఎవరూ నమ్మడం లేదని, 2014లో రుణమాఫీ పేరిట నట్టేట ముంచారని విమర్శించారు. చిత్తూరులో మార్కెట్‌కు సంబంధించి రూ.94లక్షలతో మార్కెట్ రుసుం లేకుండా చేశామన్నారు. అలాగే చిత్తూరుకు యూనివర్సిటీ, రింగురోడ్డును తెస్తామని ఆయన హామీ ఇచ్చారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

బొమ్మసముద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మురళి, విజయ్‌కుమార్ బుధవారం విజయానందరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని ఆయన సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు వేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరినట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు ప్రవీణ్, మధుసూదన్‌రెడ్డి, రజనీకాంత్, మధుసూదన్‌రాయల్, జయకోడి, ప్రసాద్, ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, రవి, సామ్‌వేల్, వైఎస్సార్‌సీపీ నాయకులు శిలంబరసన్, కారిమేఘన్, యోవాన్, దయానందరెడ్డి, జయశేఖర్‌రెడ్డి, దావిద్, రాజా, సమాధానం, ప్రభు, చిట్టి, పద్మనాభం, దాము, బాబు తదితరులు పాల్గొన్నారు.



గుడిపాల: విజయానందరెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు



గుడిపాల: ఎన్నికల ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి

పారిశుద్ధ్య పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో చేస్తున్న పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్ అరుణ బుధవారం తనిఖీ చేశారు. కొంగారెడ్డిపల్లె, చర్చివీధుల మురుగునీటి కాలువల్లో పూడిక తీత పనులను తనిఖీ చేశారు. పెద్ద కాలువలు ఉన్నచోట కల్వర్టు కింద పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, ఫాగింగ్ పనులను పక్కాగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రజారోగ్యశాఖ అధికారి చిన్నయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి, కేంద్ర సాయుధ బలగాలు

తవణంపల్లె: మండలంలోని తవణంపల్లె, అరగొండ, గాజులపల్లె, తెల్లగుండ్లపల్లె గ్రామాల్లో బుధవారం కేంద్ర సాయుధ పోలీసులు కవాతు నిర్వహించారు. చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి, తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో పోలీసులపై నమ్మకం, ధైర్యం నింపడానికే కవాతు నిర్వహించినట్లు వివరించారు.

చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా అలీ అక్బర్



చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీగా గంగాధరనెల్లూరు మండలం అబ్బాస్ నగర్‌కు చెందిన అలీఅక్బర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు అప్పజెప్పిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని అలీ అక్బర్ చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ముస్లిం నాయకులు ఆయన్ను అభినందించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ అరుణకుమారి

తవణంపల్లె: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తవణంపల్లె తహసీల్దార్‌గా అరుణకుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె చిత్తూరు రూరల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హసీనాబీ చిత్తూరు రూరల్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆమెకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

విద్యార్థులకు ఉగాది పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉగాది పండుగ పురస్కరించుకుని తెలుగు సంవత్సరాది గొప్పదనం అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి జిల్లా అధ్యక్షులు తులసీనాథం నాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రెండు పేజీలకు మించకుండా వ్యాసం రాసి తులసీనాథం నాయుడు, కళామందిరం, గంగవరం, పలమనేరు చిరునామాకు తపాలాలో ఈ నెల 30వ తేదీ లోపు పంపాలని చెప్పారు. బాగా రాసిన 50 మంది విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన చెప్పారు.

టీడీపీ-జనసేన సైకోలను కఠినంగా శిక్షించాలి

- గీతాంజలి మృతికి వైఎస్సార్ సీపీ నేతల ఘన నివాళి
- బంగారుపాళెంలో కొవ్వొత్తుల ర్యాలీ



బంగారుపాళెం: కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బంగారుపాళెం: గీతాంజలి మృతికి కారకులైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైకోలను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. గీతాంజలికి నివాళులర్పిస్తూ బుధవారం రాత్రి బంగారుపాళెంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గీతాంజలిపై సోషల్ మీడియాలో ట్రోల్ చేసి ఆమె బలవన్మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సంక్షేమ పాలనకు ప్రజలు విశేషంగా ఆకర్షితులవుతుంటే తట్టుకోలేని మానవ మృగాలు సోషల్ మీడియా వేదికగా చెలరేగిపోతున్నాయని దుయ్యబట్టారు. సర్పంచులు ఉమాదేవి, వాణిప్రియ మాట్లాడుతూ గీతాంజలి మరణించిన తరువాత కూడా తప్పుడు ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన సైకోలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సద్దార్, ఉపసర్పంచ్ కామరాజు, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ హేమచంద్ర, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె : గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. గీతాంజలి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మండలంలోని ఐరాల క్రాస్‌లో బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హరిరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకల బరితెగింపుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ శరత్ రెడ్డి, పాలాక్షిరెడ్డి, సుజిత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐరాల: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి బలవన్మరణానికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా గుండాలను కఠినంగా శిక్షించాలని స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో తనపై చేస్తున్న ట్రోలింగ్‌కు కుంగిపోయి గీతాంజలి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె ఆత్మకు శాంతి కలగాలని పార్టీ నేతలు బుధవారం రాత్రి ఐరాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



ఐరాల: కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



ఐరాల: క్రాస్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెనుకబడిన వర్గాలను ప్రోత్సహించేందుకు 'పీఎం సూరజ్'

- జాతీయ పోర్టల్ కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య
- 17 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



ఆయుష్మాన్ భారత్ కార్డును అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పీఎం సూరజ్ జాతీయ పోర్టల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. జిల్లా స్థాయి కార్యక్రమంలో డీఆర్‌ఓ మాట్లాడారు. జిల్లాలో వెనుకబడిన వర్గాలను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించి, పీఎం సూరజ్ పోర్టల్‌ను ప్రారంభించారన్నారు. అట్టడుగు, బలహీన వర్గాలకు విద్యా, ఆర్థిక, సామాజిక సదుపాయాల కల్పన, పునరావాసం కల్పించేందుకు దీనిని ప్రారంభించారని తెలిపారు. ఈ పోర్టల్ లో రుణాలను సులువుగా పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణసౌకర్యం కల్పిస్తారని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకంతో పాటు ఆయుష్మాన్ భారత్ పథకంలో సఫాయి కర్మచారులకు ఆరోగ్యకార్డులను మంజూరు చేశారన్నారు. జిల్లాలో పీఎం సూరజ్‌కు ఎంపిక చేసిన 17 మంది లబ్ధిదారులకు రూ.2.3 కోట్ల రుణాల చెక్కులను, ఆయుష్మాన్ కార్డులను డీఆర్‌ఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, పీఎంఈ స్టేట్ కో–ఆర్డినేటర్ కావ్య, ఎల్‌డీఎం హరీష్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఏజీఎం కిశోర్ పట్నాయక్, సఫాయి కర్మచారి డీవీఎంసీ మెంబర్ రాజ్‌కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

– జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



సిబ్బందితో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణకు ఏర్పాటు చేస్తున్న కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం ఆయన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ ముగిసిన తర్వాత స్వీకరణ సమయంలో ఎలాంటి పొరబాట్లు తావివ్వరాదని సిబ్బందికి మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు తహసీల్దార్ కార్యాలయ డీటీ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ విహారం



పుష్పపల్లకిపై విహరిస్తున్న మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ

బంగారుపాళెం: మొగిలిలోని మొగిలీశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ పుష్ప పల్లకిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. రాత్రి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి పుష్ప వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. గురువారం ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం వసంతోత్సవం, త్రిశూల స్నానం, ధ్వజావరోహణం, రాత్రి చంద్రప్రభ వాహనం, శయనోత్సవం నిర్వహించనున్నారు. బొమ్మాయిపల్లెకు చెందిన మమత, ఈశ్వర్ నాయుడు దంపతులు, గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజు, ప్రధాన అర్చకు లు రెడ్డెప్ప గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ బాబు

బంగారుపాళెం: గర్భిణులు, బాలింతలు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ బాబు కోరారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బుధవారం వైద్యాధికారి డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో గర్భిణులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తలనొప్పి, కళ్లు తిరగడం, మైకం, విపరీతమైన దాహం, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తే డాక్టర్లను సంప్రదించాలన్నారు. వేసవిలో నీళ్లు, మజ్జిగ, పళ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, తలకు రుమాలు ధరించాలన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 6వ డివిజన్ సంజయ్ గాంధీనగర్‌లో కట్టమంచి హరిణిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు శుద్ధజలం ఇవ్వాలనే సంకల్పంతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అజగర్‌భాను, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు చాన్‌బాషా, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం



గుడిపాల: రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రమహేష్



చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



తవణంపల్లె : కొండ్రాజుకాలువలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చుక్కావారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని వెంగంపల్లె, కొండ్రాజుకాలువ గ్రామాల్లో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు వినయ్‌కుమార్, ప్రియాంక రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అత్యవసర సమయంలో వైద్య సేవల కోసం 104, 108ను సంప్రదించాలని సూచించారు.

గుడిపాలలో..

గుడిపాల: మండల కేంద్రంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, అలాగే రక్తపోటు, చక్కెరవ్యాధి గ్రస్తులకు గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమహేష్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి పరీక్షించారు. వైద్య సిబ్బంది సోనియా, చంద్ర, కవిత, సింధు, ప్రభావతి, రుక్మిణమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.